క్లుప్తంగా

బహుమతుల ప్రదానం



బహుమతులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని ఈ నెల 26వ తేదీన రామాయణంపై రాత పరీక్ష నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి గురువారం గ్రామ సర్పంచ్ శ్రీనివాస రెడ్డి, నిర్వాహకులు మంజునాథ్, నాగర్జునరెడ్డిలు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. గురువారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపారు. రహదారిపై ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు:మండలపరిధిలోని సుంకేసుల జలాశయానికి గురువారం ఎగువ నుంచి 1,050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో 1.026 టీఎంసీల నీరు నిల్వ ఉండగా కేసీ కా ల్వకు 602 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కల్లూరు: చికిత్స పొందుతూ కోలుకోలేక ఓ యువకుడు గురువారం మృతి చెందాడు. వివరాలు.. పెద్దటేకూరు గ్రామానికి చెందిన బి.శివ కుమార్(21) కడుపు నొప్పి భరించలేక ఈనెల 24న పురుగు మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ నల్లప్ప తెలిపారు. తండ్రి మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

కోడుమూరు రూరల్: వైఎస్సార్ ఆసరా మెగా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ చేతుల మీదుగా స్థానిక పొదుపు మహిళలకు చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు ఏపీఎం పుష్పావతి గురువారం తెలియజేశారు. స్థానిక ఎల్ఎల్‌సీ కార్యాలయ ఆవరణలో జరిగే వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మండలంలోని పొదుపు మహిళలతో పాటు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఏపీఎం కోరారు.

'బుక్ కీపర్ హరితపై చర్యలు తీసుకోండి'

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడులో బుక్ కీపర్‌గా పని చేస్తున్న హరితపై చర్యలు తీసుకోవాలని గురువారం సాయిదేవా, జ్యోతిర్మయి, యశోద, ఝాన్సీలక్ష్మి గ్రూపుల సభ్యులు శైలజ, లలిత, ఈశ్వరమ్మ, లక్ష్మిదేవి, దివ్య, కోటేశ్వరమ్మ, సువర్ణమ్మలు డిమాండ్ చేశారు. బుక్ కీపర్ అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని, అధికారులు విచారణ జరిపించాలని కోరారు. స్త్రీనిధి కింద సాయిదేవా గ్రూపులోని 9 మంది సభ్యులకు లోను మంజూరు కాగా అందులో ఏడుగురికి మాత్రమే సొమ్ము అందించిందన్నారు. జ్యోతి సంఘంలోని కాశింబీ గతంలో స్త్రీనిధి లోను కంతులను పూర్తిగా చెల్లించిందని, అయితే బుక్ కీపర్ హరిత ఇంకా రూ. 96,000 కట్టాలని మానసికంగా ఒత్తిడి చేస్తోందన్నారు. ఝాన్సీలక్ష్మి గ్రూపు సభ్యులకు స్త్రీనిధి కింద మంజూరైన లోన్ వాయిదాలు సక్రమంగా చెల్లించడంతో రూ.1800 మాత్ర అప్పు ఉందన్నారు. అయితే ఇంకా రూ.1.10 లక్షలు కట్టాలని సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తోందని వారు ఆరోపించారు. బ్యాంకు రుణాలు ఇప్పిస్తే ఒక్కొక్క గ్రూపు నుంచి రూ. 2 వేలు నుంచి రూ.4 వేలు వరకు వసూలు చేస్తుందని, స్త్రీనిధి లోన్ ఇప్పిస్తే రూ. 500 నుంచి రూ. 1000 వరకు అక్రమంగా వసూలు చేస్తోందన్నారు. గ్రామంలోని చాలా మంది సభ్యురాళ్లకు తెలియకుండా స్త్రీనిధి సొమ్మును ఇతరులకు అందిస్తు వారి నుంచి డబ్బులు వసూలు చేస్తుందని ఆరోపించారు. హరిత అవినీతి అక్రమాలపై అన్ని ఆధారాలు ఉన్నాయని సోమవారం జరిగే స్పందనలో కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీకి అందిస్తామని తెలిపారు. ఈ విషయంపై మండల వైకేపీ ఏపీఎం సుధాకర్‌ను వివరణ కోరగా బుక్ కీపర్ హరిత అక్రమాలపై ఎవ్వరూ ఫిర్యాదు చేయలేదని, ఆధారాలు అందిస్తే విచారణ జరిపి తప్పు రుజువైతే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

టోల్ పెంపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): దేశంలో ఏప్రిల్ 1 నుంచి అన్ని రకాల టోల్‌ప్లాజాల పన్నులు పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏపీపీటీడీ(ఆర్టీసీ) స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యరాజు, వీఎస్ రాముడు డిమాండ్ చేశారు. గురువారంకార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వారు మాట్లాడారు. టోల్ పెంపుతో ఆర్టీసీకి మరింత భారం పడుతుందన్నారు. ఏఆర్‌టీడబ్ల్యూఫ్ చేపట్టిన నిరసన ఎస్‌డబ్ల్యూఫ్ మద్దతు ఇస్తుందన్నారు.



అమడగుంట్లలో భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం



కోడుమూరులో సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



అమడగుంట్లలో...



కాల్వ గ్రామంలో మంగళసూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న దృశ్యం



ఓర్వకల్లులో హాజరైన భక్తులు

వైభోగం..రాములోరి కల్యాణం

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- రామ నామ్మంతో మార్మోగిన ఆలయాలు
- సీతారాముల కల్యాణోత్సవం తిలకించిన తరించిన భక్తజనం

కోడుమూరు రూరల్/ఓర్వకల్లు/పాణ్యం: శ్రీరామనవమి వేడుకలను గురువారం కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కోడుమూరులోని శ్రీరాములవారి దేవాలయంలో ఎస్ఎస్‌కె సమాజ్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణం అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి, సాయంత్రం ఉత్సవ మూర్తులను పల్లకిలో పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కె సమాజ్ సంఘ సభ్యులు నాగరాజు, రాంప్రసాద్, బాబు, వెంకటరమణ, వీరన్న, శేఖర్, నాగేందర్,విష్ణు, వీరన్న తదితరులున్నారు. అదేవిధంగా మండలంలోని క్రిష్ణాపురం, అమడగుంట్ల, వర్కూరు, బైస్‌దొడ్డి గ్రామాల్లోని శ్రీరాములవారి ఆలయాల్లో శ్రీసీతారాముల కల్యాణాన్ని ఘనంగి నిర్వహించారు. అమడగుంట్లలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, రిటైర్ ఎస్ఈ కానాపురం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని గ్రామస్తులు నిర్వహించారు. అనంతరం ఆయన వందలాది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్‌యార్డు చైర్మన్ భీమిరెడ్డి, గ్రామపెద్దలు గోపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేష్, మధుసూదన్ నరెడ్డి, హుసేన్‌నాయుడు, శ్రీరాములు న్నారు.

☛ ఓర్వకల్లు మండలంలోని నన్నూరు, ఉయ్యాలవాడ, పూడిచెర్ల, ఓర్వకల్లు, హుసేనాపురం, శకునాల, కాల్వ గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఈఓలు డీఆర్‌కేవీ ప్రసాద్, మద్దిలేటి ఆధ్వర్యంలో స్వాముల వారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు పానక పందేరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఆయా గ్రామాల సర్పంచులు చంద్ర గోవర్ధనమ్మ, తోట అనూష తదితరులు పాల్గొన్నారు.

☛ మండల కేంద్రమైన పాణ్యంలోని శ్రీ పాణికేశ్వర స్వామి ఆలయంలోని శ్రీరామాలయంలో రాములోరి కల్యాణహోత్సవాన్ని పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. రామనామంతో ఆలయాలు మార్మోగాయి. ఈఓ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కల్యాణ మూర్తులను ఊరేగించారు. పాణ్యం బస్టాండ్‌లో ఉన్న శ్రీవాల్మీకి మహర్షి ఆలయం వద్ద, నెరవాడ గ్రామంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు.

సి.బెళగల్/గూడూరు/గూడూరు రూరల్: మండల కేంద్రం సి.బెళగల్‌తో పాటు మండల పరిధిలోని మారందొడ్డి, పోలకల్, కె.సింగవరం, ముడుమాల, సంగాల తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ప్రజలు జరుపుకున్నారు. మారందొడ్డిలోని రాముల వారి ఆలయంలో సీతారాముల కల్యాణ, ఉత్సవ విగ్రహాలను ప్రభోత్సవం వైభవంగా నిర్వహించారు. సంగాలలో పల్లకోత్సవం చేపట్టారు. మేళతాళాలతో పెద్దఎత్తున బాణసంచా కాలుస్తూ భక్తులు ఊరేగించారు. గూడూరు మండల పరిధిలోని గుడిపాడు, చనుగొండ్ల గ్రామాల్లోని శ్రీరాముల వారి దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని భక్తులు కనులారా తిలకించి తరలించారు. గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ వాల్మీకి, సీతారాముల వారి గుడి, తూర్పు బీసీ కాలనీలోని రామాలయం, రాజవీధి లోని అంభభవానీ మాత ఆలయంలోని రాముల వారి ఆలయంలో శాస్త్రోక్తంగా సీతా రాముల వారి వివాహ మహోత్సవం అర్చకులు నిర్వహించారు. తూర్పు బీసీ కాలనీలో జరిగిన వేడుకలో మాజీ జెడ్పీటీసీ ఎల్.వెంకటేశ్వర్లు దంపతులు వేదికపై కూర్చుని రాముల వారి వివాహం జరిపించారు.



పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని



సి.బెళగల్‌లో సీతారాముల కల్యాణ వేడుక



సి.బెళగల్‌లో కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



మారందొడ్డిలో ప్రభోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

☛ **వేడుకల్లో ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య**

కల్లూరు: శ్రీరామ నవమి వేడుకలు కల్లూరు అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో కనుల పండువగా జరిగాయి. కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య నగరంలోని 19వ వార్డులోని మారుతి నగర్, గణేష్ నగర్‌లలోని మారుతి రామేశ్వరాలయం, వెంకటేశ్వర్వస్వామి ఆలయంలో, 21వ వార్డు డాక్టర్స్ కాలనీలోని సీతారాముల ఆలయంలో జరిగిన సీతారాముల వారి కల్యాణ మహోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజాలు చేశారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి 32వ వార్డులోని శ్రీ పంచముఖ ఆంజనేయ దేవాలయంలో జరిగన కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో పాటు స్థానిక కార్పొరేటర్ సాన శ్రీనివాసులు వేడుకల్లో పాల్గొన్నారు.

గడివేముల: మండల కేంద్రం గడివేములతోపాటు మండల పరిధిలోని మంచాలకట్ట, పెసరవాయి, గడిగరేవుల, చిందకూరు, బూజునూరు, దుర్వేశి గ్రామాల్లోని ఆలయాల్లో రాములవారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గడివేముల రాములవారి ఆలయం ప్రధానార్చకులు ఆదినారాయణశర్మ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.



పాణ్యంలో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం



పాణ్యంలో వాల్మీకి దేవాలయం వద్ద స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



సీతారాములు కల్యాణోత్సవంలో పాల్గొన్న మేయర్ రామయ్య



గడివేములలో భక్తులకు పానకం అందజేస్తున్న దృశ్యం



గుడిపాడులో శ్రీ సీతారాముల కళ్యాణం జరిపిస్తున్న పురోహితులు

గ్రామాల అభివృద్ధికి కృషి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో కర్నూలు ఎంపీ డాక్టర్ సింగరి సంజీవ్‌కుమార్ రూ.50 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం ఉల్చాల గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ కోడుమూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే నిధులతో పాటు ఎంపీ నిధులను వెచ్చిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ ప్రభుత్వం గ్రామాల్లో సచివాలయాలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరవ చేసిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, ఉల్చాల గ్రామ సర్పంచ్ విద్యాసాగర్, వైఎస్సార్‌సీపీ 12వ వార్డు ఇన్‌చార్జ్ పసుల సుధాకర్, వలంటీర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఉల్చాలలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

8న రన్ ఫర్ జీసస్

కర్నూలు (టౌన్): ఏప్రిల్ 8వ తేదీ కర్నూలులో నిర్వహిస్తున్న రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కర్నూలు సీటీ పాస్టర్స్ అసోసియేషన్ చైర్మన్ సజీవరావు, కన్వీనర్ దాసరి సుధీర్ పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి ప్రాంగణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని టీషర్టులు, టోపీలు, లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం 6 గంటలకు స్థానికంగా చిల్డ్రన్స్ పార్కు వద్ద ఉన్న ఆర్సీఎం చర్చి నుంచి రన్ ఫర్ జీసస్ ప్రారంభమై సి.క్యాంపు ప్రార్థన మందిరం వద్ద ముగుస్తుందన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

- సత్తాచాటిన పెద్ద కొట్టాల వృషభాలు
- బహుమతులను ప్రదానం చేసిన ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఎద్దుల బండలాగు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఇందులో పెద్దకొట్టాల వృషాభాలు సత్తాచాటాయి. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా గ్రామ మాజీ సర్పంచు చెన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో మొత్తం 15 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఇందులో నంద్యాల జిల్లా పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు నిర్ణీత సమయానికి 3615 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో గెలుపొందగా రూ.1 లక్ష ప్రదానం చేశారు. అనంతపురం జిల్లా చక్రాయపేటకు చెందిన బత్తుల రవీంద్రనాథ్ రెడ్డి, కర్నూలు జిల్లా గోర్లగుట్టకు చెందిన హేమనాథ్ రెడ్డి వృషభాలు(విడి జత) 3300 అడుగులు లాగి రెండవ స్థానంలో (రూ.80 వేలు), కర్ణాటక రాష్ట్రం పలకందొడ్డి గ్రామానికి చెందిన ఖాజాహుసేన్ వృషభాలు 3228 అడుగులు లాగి మూడో స్థానంలో(రూ.60 వేలు), నాగరకర్నూలు జిల్లా యాదిరెడ్డిపల్లె అఖిలేష్ రెడ్డి వృషభాలు 2901 అడుగులు లాగి నాల్గో స్థానంలో (రూ.50 వేలు), కర్నూలు మండలం జి.సింగవరం హర్షిణి వృషభం, ఆస్పరి మండలం పలకరిబండ నాగలింగ వృషభం(విడి జత) 2700 అడుగులు లాగి ఐదో స్థానంలో(రూ.40 వేలు) గెలుపొందాయి. పుచ్చకాయలపల్లె గొంగల చంద్ర వృషభాలు 2638 అడుగులు లాగి ఆరో స్థానంలో (రూ.30 వేలు), ఓర్వకల్లు గ్రామానికి చెందిన మంగళి నడిపెన్న వృషభం, గుమ్మడం నరసింహారెడ్డి వృషభం(విడిజత) 2610 అడుగులు లాగి ఏడో స్థానంలో (రూ.25 వేలు), కర్నూలు జిల్లా జిల్లెలకు చెందిన రవితేజేశ్వర రెడ్డి వృషభాలు 2551 అడుగులు లాగి ఎనిమిదవ స్థానంలో (రూ.20 వేలు), గద్వాల జిల్లా జమ్మిచెట్టు వెంకటేష్ వృషభాలు 2492 అడుగులు లాగి తొమ్మిదవ స్థానంలో(రూ.15 వేలు), కర్నూలు జిల్లా టి.హుసేనాపురం రామసుబ్బారెడ్డి వృషభాలు పదో స్థానంలో (రూ.10 వేలు) నిలిచాయి. ఈ పోటీలకు వాడాల రామనాయుడు, నందికొట్కూరు మహ్మద్‌రఫి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, సర్పంచు బ్రహ్మయ్య, మాజీ సర్పంచు చెన్నారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



బహుమతులను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చట్టాలపై అవగాహన కల్పించండి

కర్నూలు(సెంట్రల్): చట్టాలపై సామాన్య ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాదు తనను కలసిన డీవీఎంసీ సభ్యులకు సూచించారు. గురువారం కర్నూలు వచ్చిన ఆయనను స్టేట్ గెస్టు హౌస్‌లో డీవీఎంసీ సభ్యులు సాయిప్రసాద్, సత్తి రాజశేఖర్, రవిశాస్త్రీ, రాజు, నవీన్, రమేష్, ప్రభుదాస్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రతి నెలా సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ ఇచ్చినటువంటి జీఓలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

వర్కూరులో వైభవంగా రథోత్సవం

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరు గ్రామంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం సాయంత్రం శ్రీరాములవారి రథోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు శ్రీసీతారాముల కల్యాణాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించి ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులను చేశారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీరామచంద్రమూర్తికి జై అంటూ గ్రామస్తులు పెద్ద ఎత్తున కరతాళధ్వనులు చేస్తూ రథాన్ని లాగారు. కార్యక్రమంలో కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ సర్పంచు ఈశ్వర్‌రెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులు దేశస్థాయిలో గుర్తింపు సాధించాలి



కబడ్డీ పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



కబడ్డీ.. కబడ్డీ అంటూ కూత పెట్టి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపుతున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు(న్యూటౌన్): కబడ్డీ క్రీడాకారులు పోటీల్లో రాణించి దేశస్థాయిలో గుర్తింపు సాధించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం రాత్రి కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో రాష్ట్రస్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలకు అయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నూలు మండలంలోని పంచలింగాల, ఇ.తాండ్రపాడు, గొందిపర్ల గ్రామాల్లోని కబడ్డీ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు. గొందిపర్ల గ్రామంలో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో కబడ్డీ పోటీలను నిర్వహిస్తుండటంపై ప్రశంసించారు. క్రీడలకు తమ ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం అందిస్తోందని, మరోవైపు క్రీడాకారుల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. కబడ్డీ.. కబడ్డీ అంటూ కూత పెట్టి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 నెహెమ్యా, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, ఉప సర్పంచ్ కౌశిక్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు ఆవుల గోపాల్, రాంబాబు, వార్డు మెంబర్లు సుధాకర్, రాజశేఖర్, ఏఆర్ కానిస్టేబుల్ సుంకిరెడ్డి, మాజీ ఆర్మీ ప్రసాద్, గ్రామ పెద్దలు సిద్దయ్య, మహేశ్వరరెడ్డి, గిడ్డయ్య, లక్ష్మిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ పుల్లన్న, న్యాయ నిర్ణేతలు మెషెకు, మోసెస్ పాల్గొన్నారు. అనంతరం కర్నూలు స్టేడియం వర్సెస్ ప్రకాశం జిల్లా చీమకుర్తి కబడ్డీ జట్లు తలపడ్డాయి.

నెరవేరిన ఎదురూరు ప్రజల కల

- ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం
- పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): సీతారాముల, శివాలయం నిర్మాణంతో ఎదురూరు గ్రామ ప్రజల కలనెరవేరిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా గురువారం ఎదురూరులో సీతారాముల, శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు రాములోరి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొని సీతారామ, లక్ష్మణ, శివలింగాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో దేవాలయం నిర్మించాలన్న ప్రజల కలతో పాటు తన కల కూడా సహకారం అయిందన్నారు. ప్రజలందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేశారు. సీతారాములు, మహాశివుని చల్లని దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పాడి పంటలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆంజనేయ, వీరభద్ర, రామేశ్వరస్వామి ఆలయాల చైర్మన్ బోయ వెంకటేశ్వర్లు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, గ్రామ ప్రజలు రేపల్లె సామేల్, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఎదురూరులో కల్యాణం అనంతరం సీతారాముల విగ్రహాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్